# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  08-06-2026                సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాల నినాదంతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్ లో ఈరోజు జరిగిన అగ్ని ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.
- ❖ రాష్ట్రంలో ఎరువులు, విత్తనాలు తగినంత అందుబాటులో ఉన్నాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.
- ❖ నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాలలో మరింత విస్తరించాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకురావడం ద్వారా వివాదాలు లేకుండా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్దాంతంలో ముఖ్యమంత్రి ఈరోజు రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ... భూమిపై రైతు అన్ని హక్కులు కలిగి ఉండేల సవరించామన్నారు. రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని చెప్పారు. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యూటేషన్ తీసుకువచ్చామన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాల నినాదంతో ముందుకు సాగుతోందని తెలిపారు. గోదావరి జిల్లాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలతో పాటు.. ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్ లో ఈరోజు అగ్ని ప్రమాదం జరిగింది. ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ షాప్-1 (SMS-1) పరిధిలోని సీసీడీ (CCD) విభాగంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ల్యాడిల్ నుంచి హాట్‌మెటల్ బకెట్లు అకస్మాత్తుగా కిందపడి భారీ మొత్తంలో ద్రవలోహం పైకి రావడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందగా మరికొంత మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అగ్నిమాపక బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు చనిపోవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

====================

రైతులు భూ సారాన్ని కాపాడేందుకు పరిమితంగా ఎరువులను ఉపయోగించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురంలో ఈరోజు జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డితో కలసి మంత్రి వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు కీలక విషయాలపై దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎరువులు, విత్తనాలు తగినంత అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. గతంలో అవసరానికి మించి రసాయన ఎరువులు వేయడం వల్ల భూమి సహజ సారాన్ని కోల్పోయే పరిస్థితి వచ్చిందని, ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. రైతులు ఈసారి ఎకరానికి ఎంత అవసరమో అంతే ఎరువులను వాడాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేస్తూ... పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా సాగేందుకు దేశంలోనే మొదటిసారిగా ఒక సరికొత్త మొబైల్ అప్లికేషన్ (యాప్) ను ప్రవేశపెట్టినట్లు మంత్రి వెల్లడించారు.

విరామం

====================

గడిచిన రెండేళ్ల పరిపాలనలో రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుకు అధికార యంత్రాంగం అహర్నిశలు కృషి చేసిందని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికే తొలి ప్రాధాన్యత ఇస్తూ... అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు చేరేలా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ రికార్డు స్థాయిలో అమలు చేసి రాష్ట్రంలోని రైతాంగానికి ఒక భరోసా ఇచ్చామన్నారు. వన్ నేషన్... వన్ కార్డు విధానంలో భాగంగా మొట్ట మొదటి సారిగా స్మార్ట్ కార్డులు తీసుకువచ్చామని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరిస్తూ...

(వాయిస్ 28సెకన్లు)

====================

రాజ్యసభ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరుఫున సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ లు నామినేషన్ లు దాఖలు చేశారు. అమరావతిలోని రాష్ట్ర అసెంబ్లీ భవనంలో అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి ఈరోజు అందజేశారు. ఈ నామినేషన్ల దాఖలు ప్రక్రియలో ఎన్డీయే కూటమి పార్టీల  నాయకులు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు.

====================

ఎన్నో పోషకాలు లభించే చేపలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించ వచ్చని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మృగశిర కార్తె సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఈరోజు చేపలు, రొయ్యలతో తయారు చేసిన ఆహారాన్ని ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కొవ్వు

తక్కువగా ఉండే అధిక ప్రోటీన్లు చేపలు, రొయ్యల్లో లభిస్తాయన్నారు. గుండె కండరాలను బలోపేతం చేయడం తోపాటు కంటికి, మెదడుకు ఇవి ఎంతో మేలు చేస్తాయని నిమ్మల రామానాయుడు చెప్పారు.

====================

సంక్షేమ పథకాల అవకతవకలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేసేందుకు త్వరలో ఒక ప్రత్యేక ఫోన్ కాల్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. విజయనగరం జిల్లా బల్లంకి గ్రామంలో నిర్వహించిన నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో, పారదర్శకంగా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఈ ప్రత్యేక ఫోన్ కాల్ వ్యవస్థతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరడంలో అవకతవకలు జరిగినా, పథకాలు అందకపోయినా.. నేరుగా ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేయవచ్చని చెప్పారు.

====================

నైరుతి రుతుపవనాలు ఈరోజు పశ్చిమ, తూర్పు మధ్య అరేబియా సముద్రం, మహారాష్ట్ర, కర్ణాటక ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలోకి మరింతగా విస్తరించాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్ర, రాయలసీమలో రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

====================

====================